నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 21 మార్చి 2025 | KHAMMAM

సీఎం, ముగ్గురు మంత్రుల దిష్టిబొమ్మ దహనం

బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించడంపై పీడీఎస్‌యూ ఆగ్రహం

ఖమ్మం అర్బన్, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని కేయూ పీజీ కళాశాల ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్ధానాలు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 15 శాతం నిధులు ఇస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో కేవలం 7.57 శాతం మాత్రమే కేటాయించి నిరాశపరిచిందన్నారు. విద్యారంగం పట్ల తమకు వ్యతిరేక వైఖరి ఉంటుందనే సంకేతాలు ప్రభుత్వం ఇచ్చినట్లు బడ్జెట్ ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా విద్యారంగానికి ప్రత్యేకంగా కేటాయింపులు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినయ్, భరత్, సాధిక్ పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆల్ ది బెస్ట్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగనుంది. హిందీ పరీక్షకు అదనంగా 20 నిమిషాల సమయం కేటాయించారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:50 గంటల వరకు ఉంటుంది. ఖమ్మం జిల్లాలో 97 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 16,788 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నారు. భద్రాద్రి జిల్లాలోని 73 కేంద్రాల్లో 12,282 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఖమ్మం జిల్లాలో జరిగే పరీక్షలను 97 సిట్టింగ్, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించనున్నాయి. ఖమ్మం జిల్లాలోని పరీక్షల కోసం 1,595 మందికి పైగా ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించనున్నారు.

–ఖమ్మం అర్బన్, మార్చి 20

ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

- నేటి నుంచి పదో తరగతి రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలు
- 'ఖమ్మం'లో 97 సెంటర్లు.. 16,788 మంది విద్యార్థులు..
- 'భద్రాద్రి'లో 73 కేంద్రాలు.. 12,282 మంది విద్యార్థులు
- ఇబ్బందులపై స్పందనకు కంట్రోల్ రూం, హెల్ప్‌లైన్ నంబర్
- ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతికి అవకాశం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిశీలకురాలిగా విజయలక్ష్మీబాయి

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు ఏ ఒక్కరికీ అనుమతి లేదు. ఇన్విజిలేటర్లతోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు కూడా మొబైల్ ఫోన్లు వినియోగించకూడదని టెన్త్ బోర్డు మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోనున్నట్లు సీఎస్‌లు, డీవోల సమావేశంలో ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలో పరీక్షల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో ఉండాలని, అందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సౌకర్యాలు..

విద్యార్థులు నేరుగా విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను పొందేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై విద్యార్థి ఫొటో అతికిస్తే సరిపోతుందని, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించాలనే నిబంధన ఏమీ లేదని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ సౌకర్యం అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచారు. ఏఎన్‌ఎం కూడా పరీక్ష కేంద్రంలో అందుబాటులో ఉంటారు. విద్యార్థుల సందేహాల నివృత్తి, ఇబ్బందుల పరిష్కారం కోసం కంట్రోల్ రూమును ఏర్పాటుచేసి 8331851510 అనే హెల్ప్‌లైన్ నంబరును కూడా అందుబాటులో ఉంచారు.

అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయి..

విద్యాశాఖ సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి టెన్త్ పరీక్షల ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిశీలకురాలిగా విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందికి సూచనలు చేస్తారు. ఇప్పటికే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెండు జిల్లాల డీఈవోల నుంచి పరీక్షల ఏర్పాట్ల వివరాలు సేకరించారు.

స్క్వాడ్‌లు తనిఖీలు చేయాలి: డీఈవో

పరీక్ష కేంద్రాల తనిఖీల ఫ్లయింగ్ స్క్వాడ్‌లు వారికి కేటాయించిన రూట్లకు అనుగుణంగా తనిఖీలు చేయాలని డీఈవో సోమశేఖర శర్మ సూచించారు. ఖమ్మంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు పలు సూచనలు చేశారు. తనిఖీలు చేసే క్రమంలో అనువణువునూ నిశితంగా పరిశీలించాలని, నిబంధనలు అమలు చేసే క్రమంలో నిక్కచ్చిగా వెళ్లాలని స్పష్టం చేశారు. అవాంతరాలుంటే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం నిర్వాహకులతో జూమ్ సమావేశం నిర్వహించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లకు 344 కేంద్రాలు

2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

అధికారుల సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మార్చి 20 : జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లకు 344 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి 2024-25 రబీ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో జిల్లాలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీకి సంబంధించి లక్షా 85 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం, 73 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం.. మొత్తం 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉండాలని, కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఏప్రిల్ రెండో వారం నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని, కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల నుంచి సన్న రకం వడ్లు రాకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్, తేమ యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేయింగ్, తేమ యంత్రాల పనితీరును చెక్ చేసి సర్టిఫై చేయాలన్నారు. అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంటను కాపాడేందుకు వీలుగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద అవసరమైన మేరకు హమాలీలు ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్యం రక్తసిక్తం

- రెండు ఎన్‌కౌంటర్లు.. 30 మంది మావోయిస్టులు మృతి
- ఛత్తీస్‌గఢ్ ఎదురుకాల్పుల్లో ఒక డీఆర్‌జీ జవాన్ మృతి
- 'ఎక్స్' వేదికగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు

దండకారణ్యం నుంచి మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న జవాన్లు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 20 : తుపాకుల మోతతో దండకారణ్యం రక్తసిక్తమైంది. భీకర పోరులో ఎటు చూసినా యుద్ధ వాతావరణం నెలకొంది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన రెండు వేర్వేరు ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు, ఒక జవాన్ మృతిచెందాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ రేంజ్ పరిధి బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు పెద్ద ఎత్తున సమావేశమవుతున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్), సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాలు సంయుక్తంగా పీడియా అడవుల్లో బుధవారం రాత్రి సెర్చింగ్ ఆపరేషన్ మొదలు పెట్టాయి. ఈ క్రమంలో ఉదయం 6:30 గంటల సమయంలో జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే తేరుకున్న జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించగా.. ఇరువర్గాల మధ్య సుమారు నాలుగు గంటలపాటు భీకర పోరు సాగింది. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో గాయపడిన ఒక డీఆర్‌జీ జవాన్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. జవాన్లు తమ వేగాన్ని పెంచుతూ ముందుకెళ్లడంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో భారీ ఎత్తున మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలం నుంచి 26 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆటోమెటిక్, సెమీ ఆటోమెటిక్ వంటి తదితర ఆయుధ, వస్తు సామగ్రిని భారీ ఎత్తున జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీస్ అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు చోటేబేథియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోరోస్‌కోడో గ్రామ సమీప అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పాటిలింగం వెల్లడించారు. ఏకకాలంలో రెండు జిల్లాల్లో జరిగిన దాడుల్లో మొత్తం 30 మంది మావోయిస్టులు సహా ఓ డీఆర్‌జీ జవాన్ మృతిచెందినట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్ 'కగార్' మావోయిస్టులను తుడిచిపెట్టడమే లక్ష్యంగా దూసుకెళ్తున్నది. కాగా.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా 'ఎక్స్' వేదికగా ఈ ఎన్‌కౌంటర్‌నుద్దేశించి పోస్టు చేశారు. 'మోదీ సర్కార్ మావోయిజాన్ని తుదముట్టించడమే లక్ష్యంగా కఠినమైన చర్యలు తీసుకుంటున్నది. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశం నక్సల్స్ రహితంగా మారుతుంది' అంటూ ఘాటైన పోస్టు చేయడం సంచలనంగా మారింది.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఇంటర్ పరీక్షలు ముగియడంతో ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

ఖమ్మం అర్బన్, మార్చి 20 : జిల్లాలో 16 రోజులపాటు కొనసాగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఏడాదిపాటు అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. చివరి రోజు పరీక్ష రాసి కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఇన్నాళ్లు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ హాస్టళ్లు, ప్రత్యేక గదుల్లో ఉంటూ చదువుకున్న విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో సామగ్రితో ఇంటిబాట పట్టారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మొత్తం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. గురువారం జరిగిన పరీక్షల్లో 16,476 మందికి.. 16,033 మంది హాజరుకాగా.. 443 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పేర్కొన్నారు.

పాలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

కూసుమంచి, మార్చి 20: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిరుడు పాలేరు నీటిమట్టం అడుగంటిన నేపథ్యంలో ఈసారి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఐదు రోజుల కిందట కలెక్టర్ ఖాన్ పాలేరుకు వచ్చారు. రిజర్వాయర్ దిగువన పంటల పరిస్థితి గురించి ఆరా తీశారు. ఇబ్బందులు ఉన్న ఖమ్మం రూరల్, మధిర, బోనకల్లు ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ నుంచి తగినంత రాకపోవడంతో పాలేరుకు నీటి ఇబ్బందులు వస్తున్నాయనే విషయాన్ని గమనించారు. నాగార్జున సాగర్ నుంచి పాలేరు వరకు రావాల్సిన నీటి వాటాపై ఆరా తీశారు. పాలేరు ఎగువన నీరు వృథా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దీంతో పాలేరుకు సాగర్ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం 5,490 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో దిగువకు 4,606 క్యూసెక్కులను అధికారులు జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు వదులుతున్నారు. పాలేరు నుంచి మూడు జిల్లాలకు తాగునీటి కోసం మిషన్ భగీరథ ద్వారా 135 క్యూసెక్కులను వదులుతున్నారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా 275 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే, పాలేరు పాత కాలువ కింద కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని వరి, చెరుకు రైతుల కోసం 200 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు.